ఎంపిలతో కలిసి నేడు హస్తినకు సిఎం

- సిడబ్ల్యుసి సమావేశంలో పాల్గొననున్న రేవంత్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలో శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసి) సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లనున్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు, ఈ ఏడాది వివిధ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షుల మార్పు తదితరాంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ సమావేశానికి రేవంత్‌తో పాటు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కూడా హాజరుకానున్నారు. మరోవైపు ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే శనివారం సాయంత్రం ఢిల్లీలో కొత్తగా ఎంపికైన కాంగ్రెస్ ఎంపిలకు డిన్నర్ ఇవ్వనున్నారు. రాష్ట్రం నుంచి కొత్తగా ఎంపికైన కాంగ్రెస్ ఎంపిలకు ఈ మేరకు ఎఐసిసి నుంచి ఆహ్వానం అందింది. శనివారం మధ్యాహ్నం తర్వాత సిడబ్ల్యుసి సమావేశం కానుంది. సమావేశంలో సిఎం రేవంత్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై నివేదిక సమర్పించనున్నారు. పార్టీ ఓడిపోయిన స్థానాలు, గెల్చుకున్న స్థానాల కారణాలను విశ్లేషించనున్నట్టు సమాచారం.

కుల గణన చేపట్టాలి

- మాజీ ఎంపి వి హనుమంతరావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీకి వెళ్లి మరోసారి ప్రధాని మోడీని కలిసి కులగణన చేపట్టాలంటూ డిమాండ్ చేస్తానని మాజీ ఎంపి వి హనుమంతరావు అన్నారు. మరోసారి మోడీకి ప్రజలు అవకాశం ఇచ్చారనీ, ఈ రకమైన ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. రిజర్వేషన్‌లో 50 శాతం సీలింగ్ ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మోడీ బడుగు బలహీనవర్గాల సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌డిఎ కూటమిలో జెడియు అధినేత నితీష్ కుమార్, టిడిపి అధ్యక్షులు చంద్రబాబు కీలక పాత్ర పోషించబోతున్నదని తెలిపారు. బీహార్‌లో నితీష్ కులగణన చేస్తే 67 శాతం రిజర్వేషన్లు బీసీలకు వచ్చిందన్నారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ చేసిన ఆలోచనను మోడీ కొనసాగించాలని కోరారు. తెలంగాణలో కులగణన తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తే...బీసీలకు మేలు జరుగుతుందనీ, ఈ విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కొంత ఆలస్యమైనా కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు పెట్టాలని కోరారు.

చెక్‌డ్యాముల నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎద్దపల్లి జిల్లాలోని మానేరు వాగు చుట్టూ ఆయా గ్రామాల్లో చెక్‌డ్యాముల నిర్మాణం కోసం నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులను ఇచ్చింది. ఈ మేరకు సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా వేర్వేరుగా జీవోలతో ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామంలో మానేరు వాగు చుట్టూ చెక్‌డ్యాం నిర్మాణం కోసం రూ. 27.09 కోట్లు మంజూరు చేశారు. అలాగే ఇదే మండలంలోని మంచ ఖరామి గ్రామంలో కూడా మానేరు వాగు చుట్టూ చెక్‌డ్యామ్ నిర్మించడానికి రూ.30.67 కోట్లు కేటాయించారు. ఇదిలావుండగా పెద్దపల్లి జిల్లా సిద్దులకుంట పునరుద్ధరణ పనుల కోసం రూ.2.23 కోటుకు మంజూరు ఇస్తూ రాహుల్ బొజ్జా ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సిఇలతోపాటు ఇంజినీర్ ఇన్ చీఫ్ తీసుకోవాలని ఆయా జీవోల్లో పేర్కొన్నారు.

వచ్చే ఐద్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షసూచన

- తెలంగాణలో చురుగ్గా నైరుతి రుతుపవనాల విస్తరణ
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే ఐద్రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె నాగరత్న తెలిపారు. తెలంగాణలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా విస్తరిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి రాష్ట్రంలోని మెదక్, భద్రాచలం మీదుగా వెళ్తున్నది. రాబోయే మూడు నాలుగు రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయి. తెలంగాణ, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నెలకొని ఉంది. దీని ప్రభావం వల్ల పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు, పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. శని, ఆదివారాల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముంది. సోమ, మంగళవారాల్లో నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షం పడొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. జిహెచ్‌ఎంసి పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, అక్కడక్కడా జల్లులు పడే అవకాశముంది.

ఫీజులను నియంత్రించాలి

- గుర్తింపు లేని కాలేజీలను రద్దు చేయాలి
- సర్కారు కళాశాలల్లో సదుపాయాలు కల్పించాలి
- విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ముట్టడి



ఇంటర్ బోర్డు గేటుపైకి ఎక్కి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు కార్యాలయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గుర్తింపు లేకుండా నడుపుతున్న కాలేజీలు, అకాడమిలను రద్దు చేయాలని కోరింది. అక్రమంగా లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డును ముట్టడించారు. బోర్డు గేటు పైకి ఎక్కి విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జెండాలు చేబూని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొందరు విద్యార్థులు గేటు పై నుంచి ఇంటర్ బోర్డు కార్యాలయంలోకి దూకారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సమయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 'వుయ్ వాంట్ జస్టిస్, ఫీజుల దోపిడీని అరికట్టాలి, కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి'అంటూ ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రీచైతన్య, నారాయణ, రెసోనెన్స్, ఆకాశ్ లాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు, అకాడమీల పేరుతో లాంగ్ టర్మ్, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఒకే క్యాంపస్‌లో అనుమతి లేకుండా హాస్టల్, కాలేజీని నడుపుతున్నాయని చెప్పారు. వాటిపై ఇంటర్ బోర్డు అధికారుల పర్యవేక్షణ లేదన్నారు. హైదరాబాద్ మాదాపూర్, అయప్ప సొసైటీలలో పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు తీసుకుని అనుమతి లేకుండా ప్రవేశాలు చేపడుతూ ఫీజుల దందా చేస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ఈ దందా నడుస్తున్నా అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్పొరేట్ కళాశాలల ఫీజుల దందా బంద్ చేసి నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఒకే క్యాంపస్‌లో కళాశాల, హాస్టల్ నడిపిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,684 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని తక్షణమే భర్తీ చేయాలని చెప్పారు. కళాశాలలు ప్రారంభమై వారం రోజులు దాటినా పాఠ్యపుస్తకాలు ఇంకా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టుగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా ఆ సేవలను అందించి తప్పుల్లేకుండా మార్కులను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శికి వినతి

అనంతరం ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఉపాధ్యక్షులు రజనీకాంత్, సంతోష్ రాథోడ్, బి శంకర్, సహాయ కార్యదర్శులు ఎం మమత, డి కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, ప్రణయ్, కార్తీక్‌లతో కూడిన ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలల అక్రమాలపై అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామంటూ కార్యదర్శి హామీ ఇచ్చారని వారు తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాగరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, పవిత్ర, రాష్ట్ర నాయకులు నాగేందర్, శ్రీమాన్, శరణ్య, మస్కు చరణ్, గుండె శివ, తరంగ్, స్టాలిన్, కార్తీక్, శ్యామ్, విఘ్నేష్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి చేయాలి

- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన మూడు బ్యారేజ్‌ల సందర్శనలో భాగంగా శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలం సిరిపురం గ్రామం వద్ద నిర్మించిన సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్‌ను సందర్శించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని మంత్రి అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలన్నారు. బ్యారేజ్ సమీపంలో గల పంప్‌హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని స్థానిక మంత్రితో కలిసి అంచనా వేసి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీలకు బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన మధ్యంతర నివేదిక ప్రకారం రాబోయే వానాకాలంలో మూడు బ్యారేజీల సంరక్షణ కోసం పనులు చేపట్టామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఇఎస్‌సి జి అనిల్ కుమార్, ఎస్ఇ కరుణాకర్, ఇఇ సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటి పారుదల అధికారులు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలోని హైటెక్స్‌లో హైదరాబాద్ జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. జూన్ 7 నుంచి 9వ తేది వరకు 16వ జరగనున్న ఈ ప్రదర్శనను శుక్రవారం హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసు అడ్మినిస్ట్రేషన్ జె పరిమళ హనా నూతన్ లాంఛనంగా ప్రారంభించారు. హెచ్‌జెఎఫ్2024ను ఒక ప్రీమియర్ ఈవెంట్‌గా ఇన్‌ఫార్మా మార్కెట్స్, ఇండియా నిర్వహిస్తుంది. దీనిలో 350 మంది ఎగ్జిబిటర్‌లు 750 కంటే ఎక్కువ బ్రాండ్‌లను ప్రదర్శిస్తున్నారు. ఈ ఎక్స్‌పోలో 200,000 కంటే ఎక్కువ తాజా డిజైన్‌లు 8,000 మంది వాణిజ్య కొనుగోలుదారులను ఆకర్షించనున్నాయని భావిస్తున్నారు. 2030 నాటికి రత్నాలు, ఆభరణాల ఎగుమతులను యుఎస్ 75 బిలియన్ డాలర్లకు (రూ.6.2 లక్షల కోట్లు) పెంచాలనే భారతదేశం ప్రతిష్టాత్మక లక్ష్యానికి ఇది మద్దతు ఇస్తుందని ఇన్ఫార్మా మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ పేర్కొన్నారు.



బడిబాటకు వినూత్న ప్రచారం

- 19 వరకు నిర్వహించనున్న ప్రభుత్వం
- అమ్మ ఆదర్శ కమిటీలకే వసతుల కల్పన బాధ్యత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం.. విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం నుంచి చేపట్టింది. ఈ ఏడాది ప్రభుత్వం వినూత్నంగా ఈ ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేలా వారిని చైతన్యవంతులను చేస్తున్నది. ప్రయివేటు పాఠశాలల్లో చేరితే ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పిస్తే ఆ డబ్బు ఆదా చేసే అవకాశముంటుందనీ, పిల్లల ఉన్నత చదువులకు పొదుపు చేయొచ్చని సరికొత్త ప్రచారానికి సర్కారు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రయివేటుపై మోజు తగ్గించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

రూ.667 కోట్లతో సర్కారు బడులకు కొత్త హంగులు

రాష్ట్రంలో మొత్తం 26,823 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 20,680 చోట్ల ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశారు. 17,729 పాఠశాలల్లో అవసరమైన పనులన్నీ ఆయా కమిటీలకు ప్రభుత్వం అప్పగించింది. పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డులు, ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి తాత్కాలిక మరమ్మతుల పనులన్నింటినీ ప్రభుత్వం ఈ వేసవిలోనే మొదలు పెట్టింది. ఈ పనులకు రూ.667.25 కోట్లు కేటాయించింది. అందులో ఇప్పటికే రూ.147 కోట్లు కమిటీలకు అడ్వాన్సుగా చెల్లించింది. రాష్ట్రమంతా ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వాటి ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలనూ కొత్త హంగులతో తీర్చిదిద్దబోతున్నది.

విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యాబోధనతోపాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఒక జత షూను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి మొదలైన బడిబాట ఈనెల 19 వరకు నిర్వహిస్తారు. బడిఈడు పిల్లలను, బడిమానేసిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతోపాటు, విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. బడిబాట సందర్భంగా ప్రయివేటు స్కూళ్లపై మోజు తగ్గించి, ప్రభుత్వ పాఠశాలల పునర్వైభవానికి కృషి చేసేలా విస్తృత ప్రచారం చేపట్టాలనీ, తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నం జరగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర బాగోగులు, బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించటం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

పెండింగ్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి

- ఇంటర్ వార్షిక పరీక్షలు విధులు నిర్వహించిన వెంటనే ఇవ్వాలి
- ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద క్యాంప్ ఆఫీసర్లకు వినతిపత్రాలు



ఆందోళన చేస్తున్న తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ బోర్డు నిర్వహించే ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల నిర్వహణలో పాల్గొనే వారికి పెండింగ్ఆందోళన చేస్తున్న తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులుఆందోళన చేస్తున్న తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యుల ఆందోళన చేస్తున్న తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులురెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఆందోళన నిర్వహిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మూల్యాంక కేంద్రాల వద్ద క్యాంప్ ఆఫీసర్లకు వినతి పత్రాలు ఇచ్చినట్టు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల, ప్రాక్టికల్స్, థియరీ, స్పాట్ విధులు అనంతరం సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించేవారని, కానీ గత రెండు సంవత్సరాల నుంచి తెలంగాణ ఇంటర్ బోర్డు ఆన్లైన్ ద్వారా చెల్లిస్తానని చెబుతూ, చాలా ఇబ్బందులు గురి చేస్తోందని అన్నారు. 2023, 2024 పెండింగ్ రెమ్యూనరేషన్ ఇంతవరకు చెల్లించలేదని ,ఈ విషయంపై గత రెండు నెలలుగా అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నా ఫలితం లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవార ఇంటర్ మూల్యాంకన కేంద్రాల వద్ద భోజనం విరామ సమయంలో నిరసన తెలియజేసినట్టు తెలిపారు ఖమ్మం, హనుమకొండ, జగిత్యాల, అదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌గర్, అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, కొత్తగూడెం, నల్లగొండ, హైదరాబాద్ (కస్తూర్బా గాంధీ వెస్ట్ మారేడ్‌పల్లి) ఇంటర్ క్యాంప్ ఆఫీసర్లకు మూల్యాంక కేంద్రాల వద్ద వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 9న మూల్యాంక కేంద్రంలో పనిచేస్తున్న అధ్యాపకుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని క్యాంప్ ఆఫీసర్లకు ఇవ్వనున్నట్టు శ్రీనివాస్ కె సురేష్ తెలిపారు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని ఇంటర్ వార్షిక పరీక్ష విధుల్లో పాల్గొనే సిబ్బందికి వెంటనే రెమినేషన్ చెల్లించేవిధంగా చూడాలని కోరారు. ఈ విషయమై ఇంటర్ బోర్డు కార్యదర్శి నిర్ణయం ప్రకటించాలని కోరారు.



ఎంపి కడియం కావ్యను సత్కరిస్తున్న సిపిఐ నాయకులు

పార్లమెంట్‌లో ప్రజల గొంతుకనవుతా....

- పేదలకు ఇళ్లు, స్థలాల పట్టాలకు కృషి
- వరంగల్ ఎంపి కడియం కావ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటులో వరంగల్ ప్రజల గొంతుకనై నిలుస్తానని ఎంపి కడియం కావ్య అన్నారు. ఎంపిగా గెలిచిన కడియం కావ్య స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి శుక్రవారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిసి ఎన్నికలలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విలేకర్ల సమావేశంలో కడియం కావ్య మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను సొంత పార్టీ అభ్యర్థిగా భావించి సిపిఐ కార్యకర్తలు కష్టపడి పనిచేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్‌లో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో పేదలు, గుడిసె వాసులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలకు పట్టాలు అందించేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికలలో బిజెపిని మట్టికరిపించేందుకు సిపిఐ కార్యకర్తలు కృషి చేశారన్నారు. కాంగ్రెస్ గెలుపులో సిపిఐ కీలకపాత్ర పోషించిందన్నారు. పార్లమెంటులో ఈ ప్రాంత సమస్యలపై గళం వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి విజయసారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర నాయకులు టి వెంకట్రాములు, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, పి సుగుణమ్మ, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె భాషామియా, మద్దెల ఎల్లేష్ పాల్గొన్నారు.

జిఒ నం 10ని రద్దు చేయాలి

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలి



ఐసిడిఎస్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

- ఐసిడిఎస్ కమిషనర్ ఆఫీస్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు నష్టం కలిగించే జిఒ నం.10ను రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సునిత, పి.జయలక్ష్మి అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వెంగళరావునగర్ డివిజన్‌లో ఉన్న శిశు విహార్, ఐసిడిఎస్ కమిషనర్ ఆఫీసు ఎదుట శుక్రవారం అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 65 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50వేలు చెల్లిస్తామని, 65ఏండ్లు నిండిన వారి వివరాలు అధికారులు సేకరించి అందజేయాలని గత ప్రభుత్వం జీవో నెం.10 జారీ చేసిందని తెలిపారు. దాని వల్ల అంగన్‌వాడీలు తీవ్రంగా నష్టపోతారని, ఆ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, కొత్త జీవోను జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2023లో 24 రోజులు నిరవధిక సమ్మె చేసిన సందర్భంగా నాటి మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీలతో చర్చలు జరిపారని తెలిపారు. ఆ సందర్భంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అంగన్‌వాడీ టీచర్లకు రూ. రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష, 60ఏండ్లు దాటిన వారికి వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇస్తామని మంత్రులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీలను అమలు చేయాలని ఇప్పటికే అనేకసార్లు మంత్రులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా ప్రభుత్వం నేటికీ కొత్త ఉత్తర్వులు జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పాత జీవో నెం.10 ఉత్తర్వులనే మళ్లీ ముందుకు తెచ్చి అమలు చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే వెనక్కి వెళ్లాలని, కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం శిశువిహార్ ఐసిడిఎస్ డైరెక్టర్ కాంతివెస్లీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఐసిడిఎస్ డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ఫైల్ పెడతామని, వీఆర్ఎస్ అంశాన్ని పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మంగ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఈ వెంకటమ్మ, పి.స్వర్ణ, పద్మ, కవిత, కోటేశ్వరి, రాష్ట్ర నాయకులు వెంకటమ్మ, సుభద్ర, భానుమతి, రాజమణి, రుక్మిణి, రమాబాయి, మాసమ్మ, చంద్రకళ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు



ఆందోళన చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కార్పొరేట్ కబంధ హస్తాల్లో ఇంటర్ బోర్డు

- ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి
- ఎఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల కబంధ హస్తాల్లో ఇంటర్ బోర్డు ఉందని ఎఐఎస్ఎఫ్ విమర్శించింది. అవినీతి, అక్రమాలకు అది నిలయంగా మారిందని తెలిపింది. నారాయణ, శ్రీచైతన్య ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల రూపాయల ఫీజులు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించింది. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ బోర్డు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గేటు ముందు బైఠాయించి ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఇంటర్ బోర్డు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు నాయకులు, విద్యార్థులు యత్నించారు. అక్కడే మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేసిన బేగంబజార్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. లఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు సంబంధించిన అనుమతి ఒక దగ్గర, తరగతులు మరో దగ్గర నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఈ రకంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని చెప్పారు. మార్కులు, ర్యాంకులే వాటి లక్ష్యమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న దారుణాలను న్యాయస్థానాలు సుమోటోగా స్వీకరించాలని కోరారు. వాటిలో ఫీజులుపై ప్రభుత్వం కొరఢా ఝుళిపించాలని సూచించారు. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు గ్యార నరేష్, గ్యార క్రాంతి, రఘురామ్, నాగజ్యోతి, రెహమాన్, నెల్లి సత్య, బరిగెల వెంకటేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పల్లె పాలన

- ఎన్నికలు, ఇతర విధుల్లోనే ప్రత్యేక అధికారులు
- 15వ ఆర్థిక సంఘం నిధుల్లేవు
- కార్మికులకు జీతాల్లేవు.. కరెంట్ బిల్లులకూ పైసల్లేవు
- ట్రాక్టర్ల నిర్వహణ, రిపేర్లకు పైసల్లేక షెడ్లకే పరిమితం
- వర్షాలు కురుస్తుండటంతో పెరుగుతున్న పిచ్చిమొక్కలు
- రోడ్లు గుంతలమయం.. లోపిస్తున్న పరిశుభ్రత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం ముగిశాక పరిపాలన పడకేసింది. ప్రత్యేక అధికారులున్నప్పటికీ ఎన్నికలు, ఇతర విధులతోనే సరిపోతుంది. ప్రజలకు అందుబాటులో ఉంటుంది తక్కువ. ఉన్నా ఖజానాలో పైసల్లేక ఏ చిన్న పనీ జరగడం లేదు. 15వ ఆర్థిక సంఘం, ఇతర నిధులేవీ రాకపోవడంతో కార్మికులు, సిబ్బందికి జీతాల్లేవు. కరెంట్ బిల్లులకూ పైసల్లేవు. ట్రాక్టర్ల నిర్వహణ, రిపేర్లకు దిక్కులేక షెడ్లకే పరిమితమయ్యాయి. వర్షాలు కురుస్తుండటంతో ఊర్లల్లో చెట్లు, చెదారం పేరుకుపోతోంది. రోడ్ల తాత్కాలిక రిపేర్లు చేసే పరిస్థితి లేదు. వేసవిలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు మిషన్ భగీరథ నీళు చాలక ట్యాంకర్లు పెట్టి సరఫరా చేశారు. వైకుంఠదామాలు, పల్లె ప్రకృతి వనాలకు నీటి కోసం బోర్లకు మోటర్లు నడిపారు. కరెంట్ బిల్లులు కట్టకపోవడంతో విద్యుత్ శాఖ వడ్డీ భారం మోపుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 12769 పంచాయతీలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలు న్నాయి. సంగారెడ్డి జిల్లాలో 647, సిద్దిపేట జిల్లాలో 499, మెదక్ జిల్లాలో 469 పంచాయతీలున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1న ముగియడంతో రెండు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అధికారుల పాలన అందుబాటులోకి వచ్చింది. ఐదు నెలలుగా ప్రత్యేక అధికారులే పరిపాలనా వ్యవహారాల్ని చక్కబెడుతూ వస్తున్నారు. పాలక వర్గాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఊరి అవసరాలు తీర్చడం, పలు అభివృద్ధి పనుల్ని చేపట్టే వారు. తాగునీటి సరఫరా పరిసరాల పరిశుభ్రత, హరితహారం, వైకుంఠదామాలు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు, వైద్య ఆరోగ్యం, విద్యా కార్యక్రమాలు చేపట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పాటు స్థానికంగా ఆర్థిక వనరుల్ని సృష్టించుకోవడం, అవసరమైన వస్తువుల్ని ఉద్దెర తెచ్చి పరిష్కరించేది.

15వ ఆర్థిక సంఘం నిధులురాలే..

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. గతేడాది డిసెంబర్ తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల్లో పాలనంతా అస్తవ్యస్తంగా మారింది. మెదక్ జిల్లాకు పంచాయతీల నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.6.75 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యేవి. సిద్దిపేట జిల్లాకు రూ.7.25 కోట్లు, సంగారెడ్డి జిల్లాకు రూ.పది కోట్ల వరకు నిధులు వచ్చేవి. నిధులు రాకపోవడం వల్ల పంచాయతీల్లో ఏ ఒక్క పనీ జరగడం లేదు. పారిశ్రామిక ప్రాంతాల్లో సిఎస్ఆర్ నిధుల్ని స్థానిక పంచాయతీల అవసరాలకు ఉపయోగించేది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాలో సిఎస్ఆర్ ఫండ్స్‌ను జిల్లా స్థాయిలో కేటాయింపులు చేయాలని మంత్రి చెప్పడంతో పరిశ్రమలున్న పంచాయతీలకూ నిధుల్లేకుండా పోయింది.


జీతాల్లేక కార్మికుల పస్తులు

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి జీతాల్లేక మూడు నాలుగు నెలలు కావస్తోంది. పాలక వర్గాలున్నప్పుడు నిధులు వస్తే కార్మికులకు వేతనాలిస్తుండేది. ప్రస్తుతం బడ్జెట్ రాలేదని చెప్పి వేతనాలివ్వకపోవడంతో కార్మికులు పస్తులుండి పని చేస్తున్నారు. మెదక్ జిల్లాలో 1725 మంది, సిద్దిపేటలో 1800 మంది, సంగారెడ్డి జిల్లాలో 2500 వరకు కార్మికులున్నారు. వీరందరికీ నెలకు రూ.9500 చొప్పున వేతనాలు చెల్లించాలి.

తాత్కాలిక మరమ్మతులకూ పైసల్లేవు

గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు చెడిపోతే కొత్తవి సమకూర్చేందుకు పైసలు కావాలి. కరెంట్ మోటర్ల రిపేర్లు వస్తున్నాయి. వైరింగ్, ట్రైట్లు, ఇతర వస్తువుల్ని సర్పంచ్‌లు ఉద్దెర తెచ్చి బడ్జెట్ వచ్చాక చెల్లించేది. ప్రత్యేక అధికారులు అప్పు చేసేందుకు సిద్దపడట్లేదు. నీటి సరఫరాలో పైపుల లీకేజీలు, ట్యాంకర్లు, నల్లాల మరమ్మతులు వస్తున్నాయి. వేసవిలో ట్యాంకర్లలో నీటిని సరఫరా చేయడం, అద్దె బోర్లు నడిపినందుకు చెల్లించే అద్దెలకు కూడా డబ్బుల్లేని పరిస్థితి ఉంది. వర్షాలు పడుతున్నందున ఊర్లల్లో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందుల్ని కొనేందుకు పైసల్లేవు. ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ, ట్యాంకర్ రిపేర్లు, డీజిల్, డ్రైవర్ ఖర్చులకు పైసల్లేక రిపేర్ వస్తే అవి షెడ్‌లోనే మగ్గుతున్నాయి. రోడ్లు, వీధుల్లో గుంటల్ని పూడ్చడం, మట్టి కొట్టడం, చెట్లు నరకడం వంటి పనులకు పైసల్లేక ఇబ్బందిగా మారిందని పలువురు అధికారులు వాపోతున్నారు. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపితే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. ఆలస్యం అయ్యేకొద్దీ సమస్యలు తీవ్రం అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇరిగేషన్ సలహాదారుగా ఆదిత్యనాథ్ దాస్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాగునీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సలహాదారుగా మాజీ ఐఎఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ శాంతికుమారి శుక్రవారం జిఒ నెంబరు 811ని విడుదల చేశారు. ఇటీవల మరణించిన రంగారెడ్డి స్థానంలో ఆదిత్యనాద్ దాస్‌ను నియమించారు. ఆదిత్యనాథ్‌దాస్ 1987 బ్యాచ్‌కు చెందిన ఎపి క్యాడర్ ఐఎఎస్ అధికారి. దాస్ 2021 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. ఉమ్మడి ప్రభుత్వంలో వైఎస్ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖ కార్యదర్శిగా పనిచేశారు.



కొత్తభవనాలు కట్టించాలని నిరసన తెలుపుతున్న ఎఐవైఎఫ్ నాయకులు

హోమియోపతి ఆస్పత్రిలో కూలిన స్లాబ్ పెచ్చులు

- ఇద్దరికి గాయాలు
- కొత్త భవనాలు కట్టించాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రి ఇన్ పేషంట్ వార్డులో సిలింగ్ పెచ్చులు ఊడి మీద పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పిజి విద్యార్థిని స్నేహిత, హెడ్ నర్సు గాయపడ్డారు. వారిని మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రమాదమూ లేదని వైద్యులు తెలిపారు. స్నేహిత తలకు బలమైన గాయమై.. ఎనిమిది కుట్లు పడ్డాయి. హెడ్ నర్స్ సునీతకు స్వల్ప గాయాలయ్యాయి.

ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి సత్య ప్రసాద్, నాయకులు ఆస్పత్రిని పరిశీలించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఆస్పత్రులకు నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపర్చాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. మౌలిక సదుపాయాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోమియోపతి ఆస్పత్రికి ఇటీవల రూ.పది లక్షల గ్రాంట్ విడుదల అయిందని, మరమ్మతులు, ఇతర సదుపాయాల కోసం విడుదల చేశారని సూపరింటెండెంట్ లక్ష్మీదేవి చెప్పారన్నారు. ఆ నిధులను సక్రమంగా వాడనందునే ఈ ఘటన జరిగిందన్నారు. నాణ్యత పాటించకుండా పనులు చేసి రంగులతో ఆస్పత్రి భవనాన్ని ముస్తాబు చేశారని ఎద్దేవా చేశారు. తక్షణమే ఈ వార్డులోని పేషంట్‌లను ఇతర వార్డులకు మార్చాలన్నారు. ప్రభుత్వం, డిపార్టుమెంట్ ఆఫ్ ఆయుష్ శాఖ ఈ ఘటనపై విచారణ జరిపించి నిర్లక్ష్యం కనబర్చిన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరిస్తాం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తామని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నుంచి పునః ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా మూడు నెలల సుదీర్ఘ విరామం తరువాత ఈ కార్యక్రమం తిరిగి ప్రారంభమైనందున ప్రజల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి దరఖాస్తునూ పరిశీలించి సంబంధిత అధికారికి సిఫారసు చేస్తామని తెలిపారు. కాగా అన్ని విభాగాలకు సంబందించి మొత్తం 373 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120 దరఖాస్తులు, విద్యా శాఖకు సంబంధించి 43, మున్సిపల్ శాఖకు సంబందించి 43, హోం శాఖకు సంబందించి 29, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 18, ఇతర శాఖలకు సంబంధించి 120 దరఖాస్తులు అందినట్టు ప్రజావాణి అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాట్ కమిన్స్ న్యూబ్యాలెన్స్ స్టోర్ సందర్శన

హైదరాబాద్ : ప్రముఖ క్రికెటర్ పాట్ కమిన్స్ హైదరాబాద్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లోని న్యూ బ్యాలెన్స్ స్టోర్‌ను సందర్శించారు. స్పోర్ట్స్ బ్రాండ్‌లలో ఒకటైన న్యూ బ్యాలెన్స్ బ్రాండ్ పట్ల తన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని ప్రవేశ పెట్టొద్దు

- ముఖ్యమంత్రికి బిఆర్ఎస్ నేత క్రిశాంక్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని ప్రవేశ పెట్టొద్దని బిఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో కొత్తగా మద్యం కంపెనీలకు అనుమతివ్వలేదని అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గత నెలలో ప్రకటించిన వారం రోజులకే మధ్యప్రదేశ్‌కు చెందిన సోమా డిస్టలరీకి అనుమతిచ్చారని ఆరోపించారు. సదరు కంపెనీపై దేశ వ్యాప్తంగా అనేక ఆరోపణలున్నాయని గుర్తు చేశారు. అ కంపెనీ రాష్ట్రాల ఖజానాలకు గండికొడుతూ, ప్రభుత్వ సంస్థల వద్ద రుణాలను తీసుకొని ఎగ్గొడుతూ, కల్తీ మద్యం వ్యాపారం చేయడంలో ప్రఖ్యాతిగాంచిందని విమర్శించారు. అవినీతి అక్రమాలకు పాల్పడే సోమ డిస్టలరీకి రాష్ట్రంలో అనుమతిస్తే కల్తీ మద్యం ఏరులై పారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే సదరు కంపెనీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. .



ఓమెగా సరికొత్త బొటీక్ ఏర్పాటు

హైదరాబాద్: స్విస్‌కు చెందిన ప్రముఖ గడియారాల కంపెనీ ఓమెగా హైదరాబాద్‌లో కొత్తగా పునర్ డిజైన్ చేసిన బోటిక్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 36లో ఏర్పాటు చేసిన ఈ అవుట్‌లెట్‌ను శుక్రవారం లాంచనంగా తెరిచింది. 703 చదరపు అడుగుల విస్తీర్ణంలోని కొత్త బొటిక్ వినియోగదారుల అనుభవాన్ని మరింత పెంచనుందని నిర్వాహకులు తెలిపారు.

గళమెత్తిన గ్రామ పంచాయతీ కార్మికులు

- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకుంటే విధులను బహిష్కరిస్తామని హెచ్చరిక



కలెక్టరేట్ ఎఒకి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి, తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు వెళ్లబోమని దాదాపు గంటపాటు అక్కడే బైటాయించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి, కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా సమస్యలను పరిష్కరిస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి జిల్లాలో పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తూ తదితర న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుండా కార్మికులందరూ నిరవధిక సమ్మెకి సిద్ధం ఉన్నారని, వారంలోపు వేతనాలు చెల్లించకుంటే విధులను బహిష్కరించనున్నట్టు హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఎఒకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్, అన్నల్దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, అంజయ్య, మహేష్, నర్సయ్య కార్మికులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్స్ కోసం లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



'డబుల్' ఇళ్ల కోసం నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో ఇళ్లపై చర్చించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకున్న తర్వాత మల్లన్నసాగర్ నిర్వాసితులు ముందుకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఒక నిర్ణయం వస్తుందని మాత్రమే తాను చెప్పినట్టు ఎమ్మెల్సీ చెప్పారు. బాధ్యతగా తాను వివరించినప్పటికీ.. నిర్వాసితులకు రావాల్సిన అన్ని వసతులు వచ్చిన తర్వాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి తన వంతు కృషి చేస్తానని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభం

హైదరాబాద్ : మూడు రోజుల ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. గుడి మల్కాపూర్ రోడ్డులోని కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన దీనిని శుక్రవారం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్ట్ కలెక్టర్ పార్వతి రెడ్డి, ఎన్ఎఆర్ ఇన్‌ఫ్రా డైరెక్టర్ కె లక్ష్మాగౌడ్ ప్రారంభించారు. ముంబయి, ఢిల్లీలో 20 ఎడిషన్ల తర్వాత కళా ఉత్సవం ఇప్పుడు హైదరాబాద్‌కు వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. 'నగరంలో ఇది మా తొలి ప్రదర్శన. ఇక నుంచి హైదరాబాద్‌లో ఇది వార్షిక వ్యవహారంగా ఉంటుంది." అని ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్ రాజేంద్ర పాటిల్ తెలిపారు. ఆదివారం వరకు జరిగే ఈ ఉత్సవానికి ప్రవేశ రుసుము కింద రూ.299 వసూలు చేస్తోన్నామని.. 15 వేల మంది సందర్శకులు రావొచ్చని ఆయన అంచనా వేశారు.

స్నేహితుల మధ్య మనస్పర్థలతో ఇద్దరి హత్య

- వాట్సప్ పోస్టులను తొలగించారని కక్ష
- నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ జోన్ డిసిపి నారాయణరెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్నేహితుల మధ్య ఏర్పడిన మనస్పర్థలు చివరికి ఇద్దరి దారుణ హత్యకు దారి తీశాయి. ఇటీవల జరిగిన ఇద్దరు యువకుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ జోన్ డిసిపి కార్యాలయంలో డిసిపి కె నారాయణరెడ్డి శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

కడ్తాల్ మండల పరిధిలోని గోవిందాయపల్లి గ్రామానికి చెందిన గండమోని శివ (28) చికెన్ షాప్ వర్కర్‌గా, శేషగిరి శివ (28) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బంధువులైన వీరిద్దరూ స్వగ్రామం నుంచి మీర్‌పేట్‌లోని గాయత్రి నగర్‌కు వలస వచ్చారు. గతంలో బిజెవైఎంలో పనిచేశారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. అదే గ్రామానికి చెందిన జెల్కం రవి రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇతనికి శివలిద్దరితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 4న రవి జన్మదిన వేడుకలను బటర్ ఫ్లై సిటీ విల్లాలో ఘనంగా చేసుకున్నారు. ఈ వేడుకలకు సంబంధించి తీసిన ఫొటోలను గ్రామానికి చెందిన గ్రూపులో పోస్ట్ చేశాడు. సుమారు 200 నుంచి 300 వరకు ఫొటోలు పోస్ట్ చేయడంతో గండమోని శివ వాటిని గ్రూప్ నుంచి తీసేసాడు. దీంతో అవమానంగా భావించిన రవి అతనితో వాగ్వాదానికి దిగాడు. గండమోని శివపై రవి కక్ష పెంచుకున్నాడు. ఇందులో భాగంగానే జంగారెడ్డిపల్లికి చెందిన పల్లె నాగరాజుగౌడ్, గోవిందాయపల్లికి చెందిన తలకొండ రాజు, గెలుకుంట విజయ్, మిట్ట ప్రవీణ్, దాసు శేఖర్, టి జగదీష్‌తో కలిసి పథకం వేశాడు. 5న రవి ఇన్నోవా కారులో మీర్‌పేట్ వెళ్లి గండమోని శివ, శేషగిరి శివను బలవంతంగా కారులో ఎక్కించుకున్నాడు. అక్కడి నుంచి రవి నివాసం ఉంటున్న విల్లాకు తీసుకెళ్లాడు. వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన పోస్టులు, డిలీట్ చేసిన విషయంపై గండమోని శివపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో నాగరాజ్‌గౌడ్ తన దగ్గర ఉన్న కత్తితో శివను విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దాన్ని చూసి శేషగిరి శివ భయపడి పారిపోవడానికి ప్రయత్నించాడు. లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో పారిపోలేకపోయాడు. దీంతో అందరూ కలిసి మూకుమ్మడిగా అతనిపైనా దాడి చేసి కత్తితో పొడిచి చంపేశారు. అనంతరం నిందితులు అదే కారులో కడ్తాల్ నుంచి శ్రీశైలం హైవే మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు. ఒక ఆస్పత్రి వద్ద కారు వదిలేసి పారిపోయారు. ఇద్దరు వ్యక్తుల దారుణ హత్య ఘటన గురించి స్థానికులు ఇచ్చిన సమాచారంతో 6వ తేదీన కడ్తాల్ సీఐ శివ ప్రసాద్, షాద్‌నగర్ ఎసిపి రంగస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సైబరాబాద్ సిపి మహంతి ఆదేశాల మేరకు శంషాబాద్ జోన్ డిసిపి నారాయణరెడ్డి, అడిషనల్ డిసిపి రామ్ కుమార్ పర్యవేక్షణలో షాద్‌నగర్ రూరల్ సిఐ సత్యనారాయణతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వేర్వేరు చోట్ల ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కారు, కత్తులు, రక్తంతో కూడిన బట్టలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

నిమ్స్‌లో మెదడు కణితి ఆపరేషన్ విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనేక అరుదైన చికిత్సలు, శస్త్ర చికిత్సలను విజయవంతం చేసిన నిమ్స్ మరో ఘనతను సాధించింది. ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగం డాక్టర్లు అత్యంత సంక్లిష్టమైన మెదడు కణితి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. తద్వారా తీవ్రమైన తల నొప్పి, వాంతులతో బాధ పడుతున్న సంగారెడ్డికి చెందిన నరహరి (35) అనే వ్యక్తి ప్రాణాన్ని నిలిపారు. బాధితుడు న్యూరో సర్జరీ విభాగంలోని డాక్టర్ వై.తిరుమల్ నేతృత్వంలోని వైద్యుల బృందాన్ని చికిత్స కోసం సంప్రదించారు. అతడికి ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ చేసిన వైద్యులు మెదడు మధ్య భాగంలో అతి ముఖ్యమైన రక్తనాళాల మధ్యలో కణితి ఉన్నట్టు గుర్తించారు. దాని తీవ్రతను అంచనా వేసిన డాక్టర్లు 3డీ వెనోగ్రామ్ పరీక్ష ద్వారా ప్రి ఆపరేటివ్ ప్లానింగ్‌ను సిద్ధం చేశారు. గత వారం క్రానిటోమీ, అక్కిపిటల్ ట్రాన్ టెనోరియల్ అప్రోచ్ పద్ధతిలో శస్త్ర చికిత్స పూర్తి చేశారు. ప్రస్తుతం నరహరి పూర్తిగా కోలుకున్నారు.

ఆపరేషన్ చేసిన వైద్య బృందంలో ఉన్న డాక్టర్ తిరుమల్, డాక్టర్ నితిన్, డాక్టర్ విశాల్, డాక్టర్ దీపక్‌తోపాటు న్యూరో సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ సుచంద, డాక్టర్ వంశీ క్రిష్ణ, అనేస్తేసియా, రేడియాలజీ విభాగాల బాధ్యులు ఉన్నారు. వారందరినీ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఈ సందర్భంగా అభినందించారు.

సంస్కృతాంధ్ర భాషా పండితులు వేటూరి ప్రభాకర శాస్త్రి

ప్రజాశక్తి కల్చరల్



సంస్కృత ఆంధ్ర భాషల్లో సమ పాండితీ ప్రతిభకల వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు జాతికి శాశ్వత సాహిత్య సంపద అందించారని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత డిప్యూటీ సెక్రెటరీ దేవీ ప్రసాద్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని లలిత కళా వేదికపై ఎందరో మహానుభావులు మధుర స్మృతులులో భాగంగా విఖ్యాత పండితులు వేటూరి ప్రభాకర శాస్త్రి సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా దేవీ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులను చరిత్రలో మరుగు పడకుండా వారి గురించి జయంతి, సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. విశ్వవిద్యలయాలు లేదా సాహిత్య అకాడెమీలు చేయవలసిన పనినీ గాన సభ జరుపుతూ నేటి తరాలకు అందించడం ముదావహం అన్నారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనల తాళ పత్రాల నుంచి పరిస్కృతం చేసిన ప్రభాకర శాస్త్రి చిన్న వయస్సులోనే అవధాన విద్యలో ప్రావీణ్యత పొందారని వివరించారు రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ మాట్లాడుతూ తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క ను వెలుగు లోకి తెచ్చిన ప్రభాకర శాస్త్రి బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవను సమాజానికి తెలిపారని అన్నారు. అయన కవి పరిశోధకుడు వ్యాస కర్త తదితర సహితీ ప్రక్రియలో ప్రజ్ఞా శాలి అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి ఎందరో మహానుభావులు కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుందని చెప్పారు